పునరావాస ప్యాకేజీ అందేనా?

- లింగాపూర్ దళిత కాలనీవాసులకు నేటికీ అందని పరిహారం
- ఓపెన్‌కాస్టు జీవితకాలం ముగిసి మూడేళ్లు
- పలు సమస్యలతో ఇబ్బంది పడుతున్న కాలనీవాసులు



ఎస్సీ కాలనీలో నివాస గృహం దుస్థితి



లింగాపూర్ గ్రామ ఎస్సీ కాలనీ

రామగుండం: ఓపెన్‌కాస్టు స్థాపించేందుకు మా జాగలకు పైసలు, కొలువు ఇస్తామని నమ్మబలికి తీసుకున్నరు. అప్పటి నుంచి మా ఇంటి ముందు నుంచే గుంత తవ్వుడు మొదలుపెట్టి రెండేళ్ల తర్వాత పెద్ద మట్టి గుట్ట తయారైంది. చుట్టూ ఏ ఇళ్లు కనిపిస్తలేవు. మట్టి గుట్టలతో మా వాడ మీద సూర్యుడి వెలుతురు పడకుండా బొత్తిగా చీకటైంది. మధ్యాహ్నం మాత్రమే తలమీద సూర్యుడు ఉన్నప్పుడే ఎండ కొడుతుంది. ఏండ్లు గడుస్తున్నయ్ గానీ మాకిచ్చే పైసలిస్తలేరు. మా పోరగాండ్లకు కొలువులియ్యలే.. ఓపెన్‌కాస్టు జీవితకాలం ముగిసి మూడేళ్లయినా మాకు మాత్రం పునరావాస ప్యాకేజీ అందలే అంటూ కన్నీటి పర్యంతమైంది మేడిపల్లి ఓపెన్‌కాస్టు బాధిత గ్రామమైన లింగాపూర్ గ్రామ దళిత కాలనీకి చెందిన ఇరికిళ్ల లస్మమ్మ. ఇలా ఆ వాడలో ఎవరిని కదిలించినా.. ఒక్కొక్కరిది ఒక్కో దీనగాథ.

పలు సమస్యలతో సతమతం..

15ఏళ్ల క్రితమే మేడిపల్లి–లింగాపూర్ ఓపెన్ కాస్టు ప్రారంభించేందుకు అంతర్గాం మండల పరిధిలోని లింగాపూర్ గ్రామ ఎస్సీ కాలనీలో భూసేకరణ చేపట్టారు. ఆ సమయంలో భూమి కోల్పోయిన వారికి పరిహారం, పునరావాస ప్యాకేజీ అమలుకు ఒప్పందం కుదిరింది. దళిత కాలనీ పక్కనే ఓపెన్‌కాస్టు బొగ్గు తవ్వకాలతో వెలికితీసిన మట్టి కుప్పగా పోయడంతో గుట్టగా మారింది. ఏటా వర్షాకాలంలో కురిసే భారీ వర్షాలకు మట్టి బురదతో పాటు వరదనీరు కాలనీని ముంచెత్తుతుంది. ఫలితంగా విషప్రాణులు, దోమలు, దుర్వాసన, పిచ్చిమొక్కల తీవ్రత తదితర సమస్యలతో కాలనీవాసులు సతమతం అవుతున్నారు.

కార్యరూపం దాల్చని హామీలు..

2022 డిసెంబర్ 29న చివరిసారిగా రెవెన్యూ, సింగరేణి యాజమాన్యం పునరావాస ప్యాకేజీ అమలుకు జాయింట్ సర్వే చేపట్టింది. ఇందులో ఎస్సీ కాలనీలో 427 మంది ప్రజలుండగా, గృహాలతో కలిపి మొత్తంగా 12.37 ఎకరాలు సేకరించారు. అందులో 10.37 ఎకరాలు పట్టా భూమిలో 150 గృహాలను గుర్తించి వీటికి 2017లో రూ.5.57కోట్లు పరిహారం కింద చెల్లించారు. స్థానికంగా నివాసయోగ్యంగా లేదని నిర్ధారించారు. అదే సమయంలో 18 ఏళ్లు నిండిన వారికి పునరావాస ప్యాకేజీ అమలు చేసి కాలనీని సురక్షిత ప్రాంతానికి తరలించేందుకు మరోచోట స్థలం ఎంపిక చేసినట్లు పేర్కొన్నారు. కానీ నేటికీ కార్యరూపం దాల్చలేదు. ఓపెన్‌కాస్టు జీవితకాలం పూర్తవడంతో పునరావాసంపై ఊసెత్తడం లేదు.

వర్షాకాలంలో ఇబ్బందులు



ఓపెన్‌కాస్టు జీవితకాలం ముగిసినప్పటికీ ఏటా వర్షాకాలంలో కురిసే భారీ వర్షాలకు మట్టికుప్పల నుంచి మట్టి వరద నీరు నేరుగా దళితకాలనీని ముంచెత్తుతుంది. ఓపెన్‌కాస్టు గుంతల్లో ఉన్న నీటితో జల విద్యుత్ కేంద్రం ఏర్పాటుకు సన్నాహాలు చేస్తున్నప్పటికీ పునరావాస ప్యాకేజీపై ఊసెత్తడం లేదు.

– ఇరికిళ్ల పద్మ, మాజీ ఎంపీటీసీ, లింగాపూర్

హామీ ఇచ్చి మరిచారు



పదేళ్ల నుంచి మా కాలనీ పొల్లగాండ్లు తిరుగుతుండ్లు. రెండేళ్ల కింద అందరం కలిసి ఓపెన్‌కాస్టు కార్యాలయం వద్ద ధర్నా చేసినం. ఆ సమయంలోనే తప్పకుండా మా కాలనీని వేరే చోటకు తరలించి ఇళ్లు కట్టుకునేందుకు పరిహారం చెల్లిస్తామని హామీ ఇచ్చి మరిచారు. మా బతుకులు ఇదే మట్టికుప్పల్లో కలవకుండా కాపాడండి.

– ఇరికిళ్ల రాజమ్మ, దళితకాలనీ

పునరావాస కల్పనకు చొరవ



ఎమ్మెల్యే సహకారంతో ఎస్సీ కాలనీని సురక్షిత ప్రాంతానికి తరలించేందుకు సంపూర్ణంగా కృషి చేస్తున్నా. ఇప్పటికే దీనిపై ఎమ్మెల్యే సంబంధిత అధికారులతో చర్చించాం. మరోమారు సంబంధిత అధికారులతో క్షేత్ర సర్వే చేయించి పరిస్థితిని సమీక్షించాలని ఎమ్మెల్యేను కోరాం. దీనిపై ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించారు.

– కాసర్ల మల్లేశ్, కాలనీవాసి, నిర్వాసితుల సొసైటీ అధ్యక్షుడు

ప్యాకేజీ అమలుకు కృషిచేస్తా



బీఆర్‌ఎస్ పదేళ్ల అధికారంలో ఉన్న సమయంలో ఓపెన్‌కాస్టు నుంచి బొగ్గు ఉత్పత్తి జరిగింది. అదే సమయంలో సంస్థపై ఒత్తిడి తెచ్చి పునరావాస ప్యాకేజీ సాధించడంలో బీఆర్‌ఎస్ ప్రతినిధులు విఫలమయ్యారు. ప్రస్తుతం ఓపెన్‌కాస్టు జీవితకాలం పూర్తయింది. అయినప్పటికీ లింగాపూర్ దళితకాలనీవాసుల సమస్యలను ఇప్పటికే సింగరేణి సీఎండీ దృష్టికి తీసుకెళ్లాను. ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ అమలుకు చిత్తశుద్ధితో కృషి చేస్తా.

– మక్కాన్‌సింగ్‌ఠాకూర్, ఎమ్మెల్యే, రామగుండం

క్లుప్తంగా

వృత్తి నైపుణ్యం పెంపొందించుకోవాలి



మాట్లాడుతున్న జడ్జి టి.శ్రీనివాసరావు

గోదావరిఖనిటౌన్: ఉద్యోగులు వృత్తి నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలని గోదావరిఖని అదనపు జిల్లా న్యాయమూర్తి డాక్టర్ టి.శ్రీనివాసరావు అన్నారు. మండల న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో శనివారం అదనపు జిల్లా న్యాయస్థానంలో కోర్టు సిబ్బందికి జరిగిన అవగాహన సదస్సులో ఆయన హాజరై మాట్లాడారు. విధుల్లో నిరంతరం అప్రమత్తంగా ఉంటూ జవాబుదారీతనంగా పనిచేయాలని సూచించారు. కోర్టు ఏవో శ్రీనివాసరాజు, లేబర్ కోర్టు సూపరింటెండెంట్ శ్రీధర్, తిరుపతమ్మ పాల్గొన్నారు.

పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి

జూలపల్లి: గ్రామాల్లో వ్యాధులు దరిచేరకుండా ప్రత్యేక పారిశుధ్య పనుల్లో శ్రద్ధ వహించాలని మండల పంచాయతీ అధికారి అనిల్‌రెడ్డి సూచించారు. ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమంలో భాగంగా శనివారం అబ్బాపూర్, జూలపల్లి, కుమ్మరికుంట గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణ, తాగునీటి సరఫరా కార్యక్రమాలను పర్యవేక్షించారు. హుస్సేన్‌మియా వాగులో చెత్త తొలగింపు, స్థానిక ప్రభుత్వ దవాఖానలో పారిశుధ్య పనులు నిర్వహించారు. వైద్యాధికారి సంపత్‌రెడ్డి, కార్యదర్శులు, సిబ్బంది ఉన్నారు.

రమణీయం.. కల్యాణం



కాల్వశ్రీరాంపూర్: మండల కేంద్రంలోని శ్రీకృష్ణాలయంలో రుక్మిణీ–శ్రీకృష్ణుల కల్యాణం శనివారం అర్చక పూజారి అనంతశ్రీరాములు జరిపించారు. వివిధ గ్రామాల భక్తులు స్వామివార్లకు సారె, ఓడి బియ్యం, కట్న కానుకలు సమర్పించారు. మహిళలు మంగళహారతులు పాడారు. భజనలు, కీర్తనలతో ఆలయ ప్రాంగణం మారుమోగింది. మాజీ ఎంపీపీ సారయ్యగౌడ్, మాజీ జెడ్పీటీసీ లంక సదయ్య, ఏఎంసీ చైర్మన్ రామిడి తిరుపతిరెడ్డి, సింగిల్ విండో చైర్మన్ చదువు రాంచంద్రారెడ్డి, వైస్ చైర్మన్ రాజమల్లు, మాజీ చైర్మన్ జిన్న రాంచంద్రారెడ్డి, మాజీ సర్పంచ్ సతీశ్ పాల్గొన్నారు.

రోడ్డుపై చెత్త వేస్తే జరిమానా కట్టాల్సిందే



జరిమానా రశీదు అందిస్తున్న సిబ్బంది

పెద్దపల్లిరూరల్: రోడ్డుపై చెత్త వేస్తే జరిమానా చెల్లించాల్సిందేనని మున్సిపల్ కమిషనర్ ఆకుల వెంకటేశ్ అన్నారు. పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు వీలుగా ప్రతీరోజు ఇంటింటికీ పారిశుధ్య సిబ్బందికి చెత్త అందించాలన్నారు. శనివారం పట్టణంలోని ప్రగతినగర్ ప్రాంతానికి చెందిన ముగ్గురు వ్యాపారులు చెత్త రోడ్డుపై వేయడంతో ఒక్కొక్కరి నుంచి శానిటరీ ఇన్‌స్పెక్టర్ రామ్మోహన్‌రెడ్డి రూ.2వేల చొప్పున జరిమానా వసూలు చేసినట్టు పేర్కొన్నారు. అనిల్, వార్డు ఆఫీసర్ లక్ష్మినర్సయ్య, వసీం ఉన్నారు.

మహా పాదయాత్రను విజయవంతం చేయాలి

పెద్దపల్లిరూరల్: రైతులు సాగు చేసిన పంటలకు సాగునీరందకుండా చేసి ఎండ బెడుతుండడాన్ని నిరసిస్తూ ఈ నెల 17 నుంచి 23 దాకా 180 కిలోమీటర్ల పాదయాత్ర కార్యక్రమం చేపడుతున్నట్టు బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు కోరుకంటి చందర్ అన్నారు. స్థానిక బీఆర్‌ఎస్ జిల్లా పార్టీ కార్యాలయంలో శనివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఉద్యమకారుడు బొడ్డు రవీందర్ ఈ పాదయాత్రకు సమన్వయకర్తగా వ్యవహరిస్తారని పేర్కొన్నారు. మహా పాదయాత్రను విజయవంతం చేయాలని కోరారు. నాయకులు మూల విజయరెడ్డి, గోపు ఐలయ్య, రఘువీర్‌సింగ్, ఉప్పు రాజ్‌కుమార్, పెంట రాజేశ్, నారాయణదాస్ మారుతి, ముల్కల కొముర‌య్య ఉన్నారు.

అన్నివర్గాలకు ఉపాధి పనులు కల్పించండి

సుల్తానాబాద్: మండలంలోని రేగడి మద్దికుంటలో అన్నివర్గాల ప్రజలకు వందరోజుల ఉపాధిహామీ పనులు కల్పించాలని ఎంపీడీవో దివ్య దర్శన్‌రావుకు బీసీ సంక్షేమ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు సంజీవ్‌గౌడ్ వినతిపత్రం అందజేశారు. మండల కేంద్రంలో శనివారం ఎంపీడీవోను కలిసి వినతిపత్రం అందజేశారు.

నిరంతరంగా బొగ్గు రవాణా



సమావేశమైన డైరెక్టర్ సూర్యనారాయణ

గోదావరిఖని: వార్షిక నిర్దేశిత లక్ష్యం గడువు సమీపిస్తున్న క్రమంలో సీహెచ్‌పీ నుంచి రైల్వేకుఅంతరాయం లేకుండా బొగ్గు రవాణా చేయాలని సింగరేణి ఆపరేషన్స్ డైరెక్టర్ ఎల్‌వీ సూర్యనారాయణ సూచించారు. శనివారం ఓసీపీ–3 సీహెచ్‌పీని ఆయన సందర్శించారు. బొగ్గు రవాణాపై సమీక్షించారు. సీహెచ్‌పీ నుంచి రవాణా అవుతున్న బొగ్గు, యంత్రాల పనితీరు, బంకర్ సామర్థ్యం తదితర విషయాలపై అధికారులతో చర్చించారు. అనంతరం బంకర్ లోకి వెళ్లి యంత్రాల పనితీరు పరిశీలించారు. ఆర్జీ–2 జీఎం వెంకటయ్య, ప్రాజెక్టు అధికారి మధుసూదన్, ఏరియా ఇంజినీర్ నర్సింహారావు, ఎస్‌వోటూ జీఎం రాముడు, డీజీఎం ఐఈడీ మురళీకృష్ణ, సీహెచ్‌పీ ఇన్‌చార్జి సదానందం తదితరులున్నారు.

పాత పద్ధతిలో వైద్యుల నియామకం చేపట్టాలి

యైటింక్లయిన్‌కాలనీ: సింగరేణి డిస్పెన్సరీ ఏరియా ఆసుపత్రిలో వైద్యుల నియామకాన్ని పాత పద్ధతిలో కొనసాగించాలని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు ఐ.కృష్ణ అన్నారు. యైటింక్లయిన్‌కాలనీ ఐఎన్‌టీయూసీ కార్యాలయంలో శనివారం నిర్వహించిన ముఖ్యనాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సింగరేణి చీఫ్ మెడికల్ ఆఫీసర్, సెక్యూరిటీ అధికారులను కాంట్రాక్ట్ పద్ధతిలో తీసుకోవడం సరైన పద్ధతి కాదన్నారు. సింగరేణిలో అనేక దశాబ్దాల నుంచి వస్తున్న సంప్రదాయాన్ని కొనసాగించాలన్నారు. డిస్పెన్సరీలను ప్రైవేట్ వ్యక్తులకు ఇవ్వడం కొత్త విధానాలతో సంస్థ నష్టపోవడంతో పాటు కార్మికులకు సరైన వైద్యం అందించడం కష్టమవుతుందన్నారు. సింగరేణిలోని వైద్యులు, సిబ్బంది నిరసన, ఆందోళన కార్యక్రమాలు చేపట్టాలని పిలుపునిచ్చారు. ఐఎఫ్‌టీయూ యూనియన్ ఉపాధ్యక్షుడు బి.అశోక్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో నాయకులు పోశం, రవి, లింగయ్య, రాములు, వినోద్, సదానందం, నంబులాద్రి పాల్గొన్నారు.

‘సౌండ్ చేస్తే.. సైలెన్సర్ తీసేస్తాం’



సైలెన్సర్‌ను పరిశీలిస్తున్న సీఐ రాజేశ్వర్‌రావు

జ్యోతినగర్: వాహనాలకు సైలెన్సర్లు మార్పు చేయడం చట్టరీత్యా నేరమని, నిబంధనలకు విరుద్ధంగా ఎవరైనా వినియోగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని, అధికంగా సౌండ్ చేస్తే ఆయా వాహనాల సైలెన్సర్లను తీసేస్తామని రామగుండం ట్రాఫిక్ సీఐ బి.రాజేశ్వర్‌రావు, ఎస్సై హరిశేఖర్ అన్నారు. ఎన్టీపీసీ రామగుండం ఎఫ్‌సీఐ క్రాస్‌రోడ్ వద్ద శనివారం వాహనాలను తనిఖీ చేశారు. భారీ శబ్దం చేస్తున్న వాహనాలను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ఇటీవల నిబంధనలకు విరుద్ధంగా వినియోగిస్తున్న 10 సైలెన్సర్లను తీసివేయించినట్లు ఆయన పేర్కొన్నారు. అధికంగా శబ్దం చేసే సైలెన్సర్ ఉన్న వాహనాలను నియంత్రించేందుకు ట్రాఫిక్ పోలీసుల ఆధ్వర్యంలో రామగుండం ప్రాంతంలో ప్రత్యేక డ్రైవ్ చేపట్టినట్లు తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా ఇండోర్, పంజాబ్, రాకెట్ పేరుతో అమర్చిన సైలెన్సర్లను మెకానిక్ సహకారంతో తొలగించామన్నారు. వాహనదారులు భద్రత నియమాలు పాటించాలని సూచించారు. ట్రాఫిక్ పోలీసులు పాల్గొన్నారు.

బొగ్గు బ్లాకుల వేలంపై అవగాహన కల్పించాలి



మాట్లాడుతున్న జనక్‌ప్రసాద్

గోదావరిఖని: సింగరేణి బొగ్గు బ్లాకుల వేలంపై కార్మికుల్లో అవగాహన కల్పించాలని, దీనికోసం అన్ని గనులపై బాయిబాట నిర్వహించాలని నిర్ణయించినట్లు ఐఎన్‌టీయూసీ సెక్రటరీ జనరల్ జనక్ ప్రసాద్ అన్నారు. శనివారం స్థానిక జనక్‌భవన్‌లో యూనియన్ మూడు ఏరియాల్లో బలోపేతంపై సమీక్ష సమావేశం నిర్వహించారు. రాబోయే కాలంలో మూడుగనులు మూతపడనున్నాయని, జైపూర్ ప్రాజెక్టులో 800 మెగావాట్ల పవర్‌ప్లాంట్ నిర్మాణానికి ఒప్పందం జరిగిందన్నారు. ఈక్రమంలో బొగ్గు ఉత్పత్తి చాలా కీలకంగా మారిందని తెలిపారు. గనులు మూతపడితే మూడు వేల మంది ఉద్యోగులే మిగిలే అవకాశం ఉందని, వీటన్నిటి దృష్ట్యా కొత్తబ్లాకులు సాధించుకోవాలని కోరారు. యూనియన్ బలోపేతంపై ప్రతీఒక్క నాయకుడు, కార్యకర్త దృష్టిసారించాలని సూచించారు. గనులపై ఏప్రిల్‌లో రణభేరి యాత్ర నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. నాయకులు నరసింహారెడ్డి, ధర్మపురి, లక్ష్మీపతిగౌడ్, వికాస్‌కుమార్‌యాదవ్, శేషరత్నం, సదానందం, బదావత్ శంకర్‌నాయక్, రవీందర్‌రెడ్డి, దాస్, సత్యనారాయణరెడ్డి, సంపత్‌రెడ్డి, పుట్ట రమేశ్, మండ రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

సహాయ ఉపకరణాలను సద్వినియోగం చేసుకోవాలి

సుల్తానాబాద్‌రూరల్: ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలు సహాయ ఉపకరణాలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా విద్యాశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ శారద అన్నారు. సుల్తానాబాద్ మండలం గర్రెపల్లి జెడ్పీహెచ్ఎస్ స్కూల్‌లో శనివారం అలింకో సంస్థ, విద్యాశాఖ సంయుక్తంగా ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు సహాయ ఉపకరణాలు పంపిణీ చేశారు. 122మంది అర్హత గల పిల్లలకు సహాయ ఉపకరణాలైన వీల్ చైర్లు, ట్రైసైకిల్లు, చెవిటి మిషన్లు, రోలాటర్, టీఎల్‌ఎం కిట్లు అందించినట్లు తెలిపారు. జిల్లా సమగ్ర శిక్ష ఐఈ కోఆర్డినేటర్‌లు కవిత, ఎండీ అజీమ్, ఎంఈవో రాజయ్య, హెచ్‌ఎం ఉన్నారు.

‘సంపత్ మృతికి ప్రభుత్వమే బాధ్యత వహించాలి’

రామగుండం: గల్ఫ్ ఏజెంట్ ఆలకుంట సంపత్ మృతికి రాష్ట్ర ప్రభుత్వమే బాధ్యత వహించాలని, రాష్ట్ర ప్రభుత్వ హత్యగా భావిస్తున్నామని, మృతుడి కుటుంబాన్ని ఆదుకోవాలని బీఆర్‌ఎస్ కార్మిక సంఘం నేత కౌశిక హరి డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం అంతర్గాం మండల కేంద్రంలోని ఆయన స్వగృహానికి వచ్చి మృతుడి కుటుంబసభ్యులను పరామర్శించారు. అలాగే రామగుండం మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ మృతుడి కుటుంబాన్ని పరామర్శించారు. సంపత్ అనుమానాస్పద స్థితిలో మరణించడంపై ఉన్నతస్థాయి కమిటీతో విచారణ చేపట్టి బాధ్యులపై చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. అనంతరం వారు సంపత్ అంత్యక్రియల్లో పాల్గొన్నారు. అంత్యక్రియలు ప్రశాంత వాతావరణంలో పూర్తి చేసేలా గోదావరిఖని ఏసీపీ మడత రమేశ్, రామగుండం సీఐ ప్రవీణ్‌కుమార్, అంతర్గాం ఎస్సై బోయ వెంకటస్వామి ప్రత్యేక చర్యలు చేపట్టారు.

అంగన్‌వాడీ ధర్నా జయప్రదం చేయండి

మంథని: అంగన్‌వాడీ టీచర్లకు, హెల్పర్లకు కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ప్రకటించిన హామీలను అమలు చేయాలని 17న తలపెట్టిన ధర్నాను విజయవంతం చేయాలని సీఐటీయూ నాయకులు కోరారు. స్థానిక సీడీపీవో కార్యాలయంలో శనివారం వినతిపత్రం అందజేశారు. నాయకులు వనజరాణి, జ్యోతి, గణేశ్, రవి పాల్గొన్నారు.

ప్రజల ఆరోగ్యస్థితిపై సర్వే

కమాన్‌పూర్: మండలంలోని పేరపల్లిలో రామగుండం సింగరేణి మెడికల్ కళాశాల 2024 బ్యాచ్‌కు చెందిన వైద్య విద్యార్థులు శనివారం ఇంటింటా ప్రజల ఆరోగ్యస్థితిపై సర్వే నిర్వహించారు. సిమ్స్ ప్రిన్సిపాల్ ఆదేశాల మేరకు ప్రతీనెల గ్రామంలోని ఇంటింటికీ వెళ్లి ప్రజల ఆరోగ్యస్థితి తెలుసుని వైద్య సలహాలు ఇస్తున్నారు. ఇన్‌చార్జి హెచ్‌వోడీ డాక్టర్ శ్రీదేవి, కావ్యరాసన్, తిరుపతిరెడ్డి, నాగరాజు, రవిసింగ్, సంగీత ఉన్నారు.

యాదవులు అన్నిరంగాల్లో ఎదగాలి

పెద్దపల్లిరూరల్: యాదవులు అన్నిరంగాల్లో ఎదగాలని యాదవ చారిటబుల్ ట్రస్టు జిల్లా అధ్యక్షుడు మారం తిరుపతి, అఖిలభారత యాదవ మహాసభ జిల్లా అధ్యక్షుడు మేకల మల్లేశం అన్నారు. పెద్దపల్లిలో శనివారం ఉగాది పురస్కారాలపై ఏర్పాటు చేసిన సమావేశంలో నాయకులు గంట రాములు, చిలారపు పర్వతాలుతో కలిసి పాల్గొన్నారు. వివిధ రంగాల్లో ప్రతిభ చూపిన యాదవులకు ఉగాది సందర్భంగా పెద్దపల్లి మండలం రంగాపూర్‌లోని ఫంక్షన్‌హాల్‌లో పురస్కారాలు అందిస్తామని పేర్కొన్నారు. వివరాలకు భాస్కర్ 9133119919, రాజేశ్ 9010661282 నంబర్లను సంప్రదించాలన్నారు. రాములు, నాగరాజు, తిరుపతి, రాజేశ్, రవి, రాజన్న, నర్సయ్య, లక్ష్మణ్, చంద్రమౌళి, భూమయ్య, అంజయ్య, లత, రవికాంత్, లింగం, సాగర్, రాజు, రాజయ్య, కుమార్ ఉన్నారు.

క్షయరహిత జిల్లాగా తీర్చిదిద్దాలి



మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో అన్నప్రసన్నకుమారి

సుల్తానాబాద్‌రూరల్: క్షయరహిత జిల్లాగా పెద్దపల్లిని తీర్చిదిద్దేందుకు సమష్టిగా కృషి చేయాలని జిల్లా వైద్యాధికారి అన్న ప్రసన్నకుమారి అన్నారు. సుల్తానాబాద్ మండలం గర్రెపల్లి పీహెచ్‌సీలో జాతీయ క్షయవ్యాధి నిర్మూలన కార్యక్రమంలో భాగంగా శనివారం చిన్నతరహా పరిశ్రమల సంస్థ సౌజన్యంతో అభయ ఫౌండేషన్ వారి ద్వారా న్యూట్రిషన్ కిట్ల పంపిణీ కార్యక్రమాన్ని రాష్ట్ర టీబీ ప్రోగ్రాం అధికారి రాజేశంతో కలిసి ఆమె ప్రారంభించారు. డీఎంహెచ్‌వో మాట్లాడుతూ ఎక్స్‌రే ద్వారా 206, తెమడ ద్వారా 220 మొత్తం 426 మంది వ్యాధిగ్రస్తులను గుర్తించినట్లు తెలిపారు. చిన్న పరిశ్రమల శాఖ అసోసియేషన్ సెక్రటరీ ఫణీంద్ర, అభయ ఫౌండేషన్ అధ్యక్షుడు బాలచందర్, టీబీ ప్రోగ్రాం అధికారి సుధాకర్‌రెడ్డి, వైద్యాధికారి ఉదయ్‌కుమార్, అభయ ఫౌండేషన్ ఉమ్మడి జిల్లా కోఆర్డినేటర్ అరుణ ప్రభంజన్, వైద్య సిబ్బంది ఉన్నారు.

విద్యార్థులకు కళ్లద్దాల పంపిణీ..

గర్రెపల్లిలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శనివారం డీఎంహెచ్‌వో అన్న ప్రసన్నకుమారి విద్యార్థులకు కళ్లద్దాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రోగ్రాం అధికారి కిరణ్‌కుమారి, వైద్యాధికారులు, సిబ్బంది ఉన్నారు.

అవార్డు అందుకున్న సింగరేణి కార్మికుడు



అవార్డు అందుకున్న బుచ్చిరెడ్డి

గోదావరిఖని: అఖిల భారత ఉగాది కళాఉత్సవ్ పురస్కారాలు–2025 అవార్డును సింగరేణి కార్మికుడు బుచ్చిరెడ్డి అందుకున్నారు. తారా ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో హైదరాబాద్ రవీంద్రభారతిలో నిర్వహించిన కార్యక్రమంలో ఐఏఎస్ అధికారి పరికిపండ్ల నరహరి, ప్రముఖ సినీనటుడు సుమన్ చేతుల మీదుగా బుచ్చిరెడ్డి అవార్డు అందుకున్నారు. సింగరేణి ఆర్జీ–1 సివిల్ డిపార్ట్‌మెంట్ వాల్ ఆపరేటర్ కుందూరు బుచ్చిరెడ్డి కోవిడ్ సమయంలో, సింగరేణి రెస్క్యూ విభాగాల్లో క్లిష్టమైన సేవలందించినందుకు గాను ఈ అవార్డుకు ఎంపిక చేశారు.

అధికారుల ఔట్‌సోర్సింగ్ భర్తీ రద్దు చేయాలి



మాట్లాడుతున్న నాయకులు

గోదావరిఖని: సింగరేణిలో ఔట్‌సోర్సింగ్ ద్వారా చీఫ్ మెడికల్ ఆఫీసర్, చీఫ్ సెక్యూరిటీ ఆఫీసర్ పోస్టులను భర్తీ చేసేందుకు జారీ చేసిన నోటిఫికేషన్ రద్దు చేయాలని ఏఐటీయూసీ నాయకులు మడ్డి ఎల్లాగౌడ్ డిమాండ్ చేశారు. యూనియన్ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. యాజమాన్యం జారీచేసిన నోటిఫికేషన్ రద్దు చేసి, కంపెనీలో పనిచేసే అనుభవం ఉన్న అధికారులకు సీఎంవో, సీఎస్‌వోలుగా పదోన్నతి కల్పించాలని కోరారు. నాయకులు కనకరాజ్, మల్లికార్జున్, తాళ్లపెల్లి మల్లయ్య, పడాల కనకరాజు, సంగి సమ్మయ్య, రాజిరెడ్డి, గాండ్ల కుమార్, నరేశ్ పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

• ఆధునిక సాంకేతికతతో విద్యాబోధన

పాలకుర్తి: ఆధునిక సాంకేతికతతో విద్యా ప్రమాణాలు మెరుగుపర్చడం కోసం ప్రభుత్వ పాఠశాలలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్(ఏఐ) టెక్నాలజీతో విద్యాబోధన చేస్తున్నట్లు ఎంఈవో విమల అన్నారు. మండలంలోని కన్నాల, బసంత్‌నగర్ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలల్లోని విద్యార్థుల కోసం ఏఐ శిక్షణను శనివారం ఆమె ప్రారంభించారు. 3, 4, 5వ తరగతుల విద్యార్థులకు బోధనా నైపుణ్యాలు మెరుగుపర్చేందుకు ఉపయోగకరంగా ఉంటుందని పేర్కొన్నారు. స్కూల్ కాంప్లెక్స్ హెచ్‌ఎం జె.కమలాకర్‌రావు, గాయత్రిదేవి, కన్నాల, బసంత్‌నగర్ ప్రాథమిక పాఠశాలల హెచ్‌ఎంలు అంజనీదేవి, బైరెడ్డి శ్రీధర్‌రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

• ఏఐ కంప్యూటర్ ల్యాబ్ ప్రారంభం

ధర్మారం: ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థుల్లో అభ్యసన సామర్థ్యం పెంపొందించేందుకే ప్రభుత్వం ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ (ఏఐ)విద్యను అందించేలా ప్రణాళిక రూపొందించిందని మండల విద్యాధికారి ప్రభాకర్ అన్నారు. మండలంలోని నర్సింహులపల్లి, కొత్తూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో శనివారం ఏఐ చదువుల కోసం కంప్యూటర్ ల్యాబ్‌లను ఆయన ప్రారంభించారు. దొంగతుర్తి స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు గోపాల్‌రెడ్డి, ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం రవీందర్, సత్యం, సతీశ్‌కుమార్, చెన్నారెడ్డి పాల్గొన్నారు.

•ఎల్‌ఆర్‌ఎస్ అవకాశం వినియోగించుకోవాలి

మంథని: అనధికార లేఔట్ల క్రమబద్ధీకరణకు, ప్లాట్ల రెగ్యులరైజేషన్‌కు రాష్ట్ర ప్రభుత్వం కల్పించిన ఎల్‌ఆర్‌ఎస్ 25శాతం రాయితీ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కమిషనర్ ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తుదారులు ఈ నెల 31గా చెల్లిస్తే 25శాతం మినహాయింపు ఉంటుందన్నారు.

• ఆలయ కమిటీ ఎన్నిక

సుల్తానాబాద్‌రూరల్: మండలంలోని ఐతరాజుపల్లి శ్రీసీతారామచంద్రస్వామి ఆలయ నూతన కమిటీని శనివారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా దీకొండ భూమేశ్, ఉపాధ్యక్షుడిగా ఎర్రం సంతోష్‌రెడ్డి, సెక్రటరీగా గుజెట్టి వెంకన్న, కోశాధికారిగా దాసరి రాజిరెడ్డి, ప్రచారకర్తగా మడ్డి సాయికిషోర్, సంయుక్త కార్యదర్శిగా రమణాచారి, ముఖ్య సలహాదారులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

• పేకాట స్థావరంపై పోలీసుల దాడి

ఎలిగేడు: మండల కేంద్రంలో పేకాట స్థావరంపై పక్కా సమాచారంతో ఎస్ఐ సనత్‌కుమార్, సిబ్బంది దాడి చేశారు. పేకాట ఆడుతున్న ముగ్గురిని పట్టుకుని వారి వద్ద నుంచి రూ.6600 నగదు, 3 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ముగ్గురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు. హెచ్‌సీ శంతయ్య, పీసీలు పవన్, అజీమొద్దీన్, మనోహర్ ఉన్నారు.

• ఆధార్ కేంద్రం ఏర్పాటు చేయాలి

రామగిరి: మండల కేంద్రంలో నూతన ఆధార్ కేంద్రం ఏర్పాటు చేయాలని బీజేపీ మండల అధ్యక్షుడు కొండు లక్ష్మన్ కోరారు. తహసీల్దార్ సుమన్‌కు శనివారం ఆయన వినతిపత్రం అందజేశారు. ఆధార్ కేంద్రం లేకపోవడంతో మండల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, వెంటనే ఏర్పాటు చేయాలని విన్నవించారు. బీజేపీ నాయకులు తోట్ల రాజు, మహేశ్ ఉన్నారు.

• కొమిరలో ఉచిత పశు వైద్యశిబిరం

ఓదెల: మండలంలోని పెద్దకొమిరలో ఓదెల పశువైద్యాధికారి మల్లేశం ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత పశువైద్య శిబిరంలో 150 పశువులకు ఆయా రకాల జబ్బులకు వైద్యసేవలు అందించారు.

• ముదిరాజ్ కమిటీ నియామకం

కమాన్‌పూర్: మండలంలోని జూలపల్లి గ్రామ ముదిరాజ్ కుల, పెద్దమ్మ ఆలయ నూతన కమిటీని శనివారం ఎన్నుకున్నారు. ముదిరాజ్ కులపెద్దగా చొప్పరి సంతోష్, ఆలయ చైర్మన్‌గా అనవేన సదయ్యను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన కమిటీ సభ్యులను ముదిరాజ్ కులస్తులు సన్మానించారు. చొప్పరి తిరుపతి, పోలుదాసరి కొమురయ్య, సాయికుమార్, చొప్పరి శంకర్, లింగయ్య, భూమయ్య, రాజయ్య పాల్గొన్నారు.

• ఎలిగేడులో కాన్షీరాం జయంతి

ఎలిగేడు: బహుజన సమాజ్ పార్టీ వ్యవస్థాపకులు కాన్షీరాం జయంతి శనివారం మండలకేంద్రంలో నిర్వహించారు. ఈ సందర్భంగా కాన్షీరాం చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. నాయకులు న్యాతరి పోచయ్య, జల్లి రమేశ్, కవ్వంపల్లి రామస్వామి, నంబయ్య, మల్లేశం పాల్గొన్నారు.

సింగరవేణికి ఉగాది పురస్కారం



పురస్కారం అందుకుంటున్న సింగరవేణి మల్లేశ్‌యాదవ్

రామగిరి: మండలంలోని నవాబ్‌పేట గ్రామానికి చెందిన సింగరవేణి మల్లేశ్ యాదవ్‌కు ఉగాది పురస్కారం దక్కింది. తార ఆర్ట్స్ అకాడమీ శుక్రవారం రాత్రి హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో విశ్వావసునామ ఉగాది కళోత్సవం–2025 ఉగాది పురస్కారాలు ప్రదానం చేసింది. జానపద కేటగిరీలో జానపద ఒగ్గు కళాకారుడు మల్లేశ్‌యాదవ్ ఎంపిక కాగా సినీ ఆర్టిస్ట్ సుమన్, ఐఏఎస్ అధికారి పరికిపండ్ల నరహరి చేతుల మీదుగా పురస్కారం అందుకున్నారు.